# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ:  29-09-2026                                   సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత్ ప్రాధాన్యత కలిగిన భద్రతా భాగస్వామిగా నిలుస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

- పంట కొనుగోలు చేసిన 48 గంటల్లోగా రైతులకు చెల్లింపులు జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు.

- భారత్-చైనా సంబంధాలు.. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం మెరుగ్గా ఉన్నాయని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అన్నారు.

- ఆసియా క్రీడల్లో మహిళల 400 మీటర్ల రిలేలో భారత జట్టు స్వర్ణ పతకం సాధించింది.

=======================

అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం, భౌగోళిక సామీప్యత కారణంగా ఎదురవుతున్న సవాళ్ల నేపథ్యంలో.. భారతదేశం తన రక్షణ సన్నద్ధతలో భౌగోళిక వ్యూహాత్మక ప్రణాళికలను అంతర్భాగంగా చేసుకోవాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన భారత నౌకాదళ కమాండర్ల సదస్సులో కేంద్రమంత్రి మాట్లాడుతూ... సంక్షోభం దేశ ద్వారం తట్టేలోపే... సన్నద్ధత సంక్షోభ స్థాయికి చేరుకోవాలన్నదే భారతదేశ లక్ష్యమన్నారు. దేశ ఇంధన సరఫరా మార్గాలను, జాతీయ ప్రయోజనాలను పరిరక్షించడంలో భారత నౌకాదళ వృత్తిపరమైన నైపుణ్యం, కార్యాచరణ సన్నద్ధతను 'ఆపరేషన్ ఊర్జా సురక్ష' మరోసారి నిరూపించిందని రక్షణ మంత్రి పేర్కొన్నారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత్ మొదటి స్పందన దేశంగా, ప్రాధాన్యత కలిగిన భద్రతా భాగస్వామిగా, విశ్వసనీయతకు ప్రతీకగా, స్థిరంగా నిలుస్తోందని తెలిపారు.

=======================

రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులకు న్యాయమైన గిట్టుబాటు ధర పొందేలా ప్రభుత్వం బహుముఖ వ్యూహంతో పని చేస్తోందని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. న్యూఢిల్లీలో జరుగుతున్న "జాతీయ

వ్యవసాయ సదస్సు - రబీ ప్రచార కార్యక్రమం"లో ఆయన ఈరోజు ప్రసంగిస్తూ... పంట కోత అనంతర నిర్వహణను బలోపేతం చేయడం, శాస్త్రీయ పద్ధతుల్లో గిడ్డంగుల నిర్వహణ, మార్కెటింగ్ వ్యవస్థలను మెరుగుపరచడం వంటి చర్యలు ప్రభుత్వ వ్యూహంలో భాగమని చెప్పారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కింద కందులు, మినుములు, మసూర్ పప్పులను ప్రభుత్వం నూరు శాతం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. రైతులకు 48 గంటల్లోగా చెల్లింపులు జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని శివరాజ్ సింగ్ వివరిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

=======================

దేశంలోని ఆర్థిక, సాంస్కృతిక, వారసత్వ ప్రాధాన్యత కలిగిన 50 నగరాలను మోడల్ నగరాలుగా అభివృద్ధి చేసేందుకు పలు నూతన కార్యక్రమాలను కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ న్యూఢిల్లీలో ఈరోజు ప్రారంభించారు. ప్రగతి@50 కింద ఈ కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... 24 రాష్ట్రాల పరిధిలోని ఈ 50 నగరాలు దేశంలోని ఇతర నగరాలకు ఆదర్శంగా నిలిచేలా పరిశుభ్రమైన మోడల్ నగరాలుగా అభివృద్ధి చెందుతాయన్నారు. పట్టణ పరిశుభ్రత, ఘన వ్యర్థాల నిర్వహణ, పారిశుద్ధ్యం, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాల్లో స్పష్టమైన మార్పులు తీసుకురావడం ప్రగతి@50 కార్యక్రమం ప్రధాన లక్ష్యమని మంత్రి వివరించారు. ఇందుకోసం నిర్దిష్ట కాలపరిమితిలో పర్యవేక్షణ, సమీక్షలతో కూడిన ఒక క్రమబద్ధమైన కార్యాచరణ ప్రణాళికను అమలు చేయనున్నామని తెలిపారు.

=======================

ప్రభుత్వ వ్యవస్థలు, సంస్థల్లో విప్లవాత్మక మార్పులు రావాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. దేశ ప్రజల ఆకాంక్షలు వేగంగా మారుతున్నాయని, వాటికి అనుగుణంగా ప్రభుత్వ పాలనా విధానాలు, ఉద్యోగుల నైపుణ్యాలు కూడా నిరంతరం మెరుగుపడాలని పేర్కొన్నారు. విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సాధన శృంఖల-2026" పేరిట నిర్వహిస్తున్న "మిషన్ కర్మయోగి" ప్రాంతీయ సదస్సును ముఖ్యమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, కేరళం, తమిళనాడు, ఒడిశా, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన అధికారులు, శిక్షణ సంస్థల ప్రతినిధులు ఈ రెండు రోజుల సదస్సుకు హాజరయ్యారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాల పెంపు, పరిపాలనా నైపుణ్యాల మెరుగుదల, ప్రభుత్వ శిక్షణ సంస్థల సామర్థ్య నిర్మాణంపై ఈ సదస్సులో ప్రధానంగా చర్చించారు. ప్రభుత్వ ఉద్యోగుల కెపాసిటీ బిల్డింగ్‌లో ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ రాష్ట్రంగా మొదటి స్థానాన్ని సాధించింది. తదుపరి స్థానాల్లో కర్ణాటక, ఒడిశా రాష్ట్రాలు నిలిచాయి. ఈ కార్యక్రమానికి కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ ఛైర్ పర్సన్ రాధా చౌహాన్, సభ్యురాలు ఆల్కా, ఆ సంస్థ కార్యదర్శి జగదీప్ గుప్తాతో పాటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పలువురు అధికారులు హాజరయ్యారు.

విరామం

=======================

భారత్-చైనా సంబంధాలు గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం మెరుగ్గా ఉన్నాయని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ పేర్కొన్నారు. న్యూయార్క్‌లో ఏషియా సొసైటీ నిర్వహించిన కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... సరిహద్దు ప్రతిష్టంభన పరిష్కారమైన తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడటం ప్రారంభమయ్యాయని చెప్పారు. ద్వైపాక్షిక సంబంధాల్లో ప్రతికూలత కొనసాగడం ఇరు దేశాలకు ప్రయోజనకరం కాదని భారత్ చాలాకాలంగా చైనాకు చెబుతూ వస్తోందని జైశంకర్ పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

అదే విధంగా భారత్-అమెరికా సంబంధాలు, ఇరు దేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య ఒప్పంద చర్చలపై జైశంకర్ స్పందిస్తూ.. వాణిజ్య ఒప్పందానికి సంబంధించి రెండు దేశాలు ఒక ఉమ్మడి అవగాహనకు వచ్చాయని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత నౌకాదళానికి చెందిన ఫ్రంట్‌లైన్ గైడెడ్ మిసైల్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ తార్కష్ ఈరోజు తూర్పు ఆఫ్రికా దేశమైన కెన్యాలోని మొంబాసా నౌకాశ్రయానికి చేరుకుంది. ఈ నౌక అక్కడ అక్టోబర్ 2వ తేదీ వరకు ఆపరేషనల్ టర్న్ అరౌండ్‌లో భాగంగా ఉంటుంది. ఈ పర్యటనలో ఇరు దేశాల నౌకాదళాల మధ్య పరస్పర చర్చలు, నౌకాదళ సిబ్బంది మధ్య సామాజిక, సముదాయ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కెన్యా నుంచి బయలుదేరిన అనంతరం ఐఎన్ఎస్ తార్కష్ కెన్యా నౌకాదళంతో కలిసి పాసేజ్ ఎక్సర్‌సైజ్‌లో పాల్గొనుంది. పశ్చిమ హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత్ - కెన్యా సముద్ర సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంలో ఈ పర్యటన దోహదపడనుందని నైరోబీలోని భారత హైకమిషన్ సామాజిక మాధ్యమ వేదికగా వెల్లడించింది. అదే విధంగా సముద్ర ప్రాంతంలో భాగస్వామ్య దేశాలతో సహకారాన్ని పెంపొందించాలనే భారత్ ప్రతిపాదించిన 'మహాసాగర్' దార్శనికతకు ఈ పర్యటన ప్రతిబింబంగా నిలుస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ కేవలం వంద కోట్లకు పైగా జనాభా కలిగిన దేశం మాత్రమే కాదని వంద కోట్లకు పైగా కథలు, ఆలోచనలు, ఆకాంక్షలకు నిలయమని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ అన్నారు. యూట్యూబ్ ఇంపాక్ట్ సమ్మిట్-2026లో ఆయన మాట్లాడుతూ... భారత ఆర్థిక వ్యవస్థకు యూట్యూబ్ 18 వేల కోట్ల రూపాయలకు పైగా సహకారం అందించిందని తెలిపారు. అలాగే 9.6 లక్షలకు పైగా ఉద్యోగాలకు మద్దతు ఇచ్చిందని చెప్పారు. ఆరెంజ్ ఎకానమీని భారత్ ప్రోత్సహిస్తూ, కంటెంట్ క్రియేటర్లకు సాధికారత కల్పిస్తోందని మురుగన్ తెలిపారు. కొత్త అవకాశాలను సృష్టించడంతో పాటు.. భారతదేశ కథలు, సంస్కృతి, ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పడంలో ఇది కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

జపాన్‌లోని నాగోయా నగరం వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత్ ఈరోజు కూడా అద్భుత ప్రదర్శన కొనసాగించింది. మహిళల 400 మీటర్ల రిలేలో భారత జట్టు స్వర్ణ పతకం సాధించింది. భారత జట్టు 3 నిమిషాల 29 సెకన్లలో పరుగు పూర్తి చేసింది. ఇక పురుషుల 400 మీటర్ల రిలేలో భారత్ కాంస్య పతకాన్ని దక్కించుకుంది. షూటింగ్‌లో నీరూ ధాండా కూడా చరిత్ర సృష్టించారు. మహిళల ట్రాప్ వ్యక్తిగత విభాగంలో స్వర్ణ పతకం సాధించిన తొలి భారతీయ షూటర్‌గా ఆమె రికార్డు నెలకొల్పారు. అంతకుముందు, ఆశిమా అహ్లావత్, మనీషా కీర్‌లతో కలిసి మహిళల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో దేశానికి రజత పతకం అందించారు. అథ్లెటిక్స్‌లో గుల్వీర్ సింగ్ పురుషుల 5 వేల మీటర్ల ఫైనల్‌లో కాంస్య పతకం సాధించారు. దీంతో ఈ క్రీడల్లో గుల్వీర్ సింగ్‌కు ఇది మూడో పతకంగా నిలిచింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =